బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తాం : డీఎం

యాచారం, సెప్టెంబరు 26 : మండలంలోని మాల్‌లో వృథాగా ఉన్న బస్టాండ్‌ను గురువారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప తనిఖీ చేశారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తేవడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. బస్టాండ్‌లో ఉన్న దుకాణా సముదాయాలు కబ్జాకు గురవుతున్నట్లు స్థానికులు డీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ తదితరులున్నారు.

స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తరలించాలి

19ఏళ్ల తర్వాత హైకోర్టు తుది తీర్పు


తాండ్ర వీరేందర్ రెడ్డి పిటిషన్‌దారు, న్యాయవాది


కేశంపేట, సెప్టెంబరు 26: పచ్చని పంట పొలాల మధ్య ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తొలగించాలని 2005లో హైకోర్టులో వేసిన పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 10న తీర్పు వెలువడింది. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గం తోపాటు కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామంలో పొలాల మధ్య ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తొలగించాలని, వాటితో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలంటూ న్యాయవాది తాండ్ర వీరేందర్‌రెడ్డి హైకోర్టులో 2951/2005 రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన చీఫ్ జస్టిస్ హలోక్ అరధే, శ్రీనివాస్ రావుతో కూడిన ధర్మాసనం 19 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 10న తుది తీర్పు వెల్లడించింది. జనావాసాలకు కిలోమీటర్ దూరంలో ఉన్న స్పాంజ్ పరిశ్రమలను ఏడాదిలోగా ఇతర ప్రాంతాలకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పొలాల మధ్య ఉన్న పరిశ్రమలలో చేపడుతున్న కాలుష్య నియంత్రణ చర్యలపై రెండు నెలలలోగా రాష్ట్ర పొల్యూషన్ బోర్డు కోర్టుకు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందేవిధంగా ప్రభుత్వం చొరవ చూపాలని తీర్పులో సూచించింది. పరిశ్రమలపై తాండ్ర వీరేందర్‌రెడ్డి చేసిన పోరాటాన్ని కేశంపేట మండల ప్రజలు అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు

యాచారం, సెప్టెంబరు 26 : ఉద్యోగుల పట్ల నల్లగొండ కలెక్టర్ వ్యవహరించిన తీరును నిరసిస్తూ గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల కలెక్టర్ తీరు దారుణంగా ఉందన్నారు. సస్పెండ్‌లు, సర్వీస్ నుంచి రిమూవ్ చేయడం సరికాదన్నారు. ఇలా చేస్తే వారి కుటుంబం రోడ్డున పడుతుందనే విషయం కలెక్టర్ గుర్తించాలన్నారు.


అనంతగిరి కొండల్లో పర్యాటకుల సందడి, (ఇన్‌సెట్‌లో) కనువిందు చేస్తున్న జలపాతం



అనంతగిరి కొండల అందాలను కెమెరాలో బంధిస్తున్న యువతి

మారుతున్న జీవనశైలిలో మనుషులు కొత్తగా ఆలోచిస్తూ పర్యాటక ప్రదేశాలకు పరుగులు తీస్తున్నారు. కరోనా లాంటి విపత్తు తర్వాత ఉన్నంతకాలం సంతోషంగా జీవించాలనే ఆలోచనతో చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రాంతాలను చూసేందుకు బారులు దీరుతున్నారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అనంతగిరి కొండలు, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టు, హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయం, శామీర్‌పేట చెరువు తదితర పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక కథనం.

నేడు ప్రపంచ పర్యాటక దినం

అనంతగిరి.. పర్యాటక సిరి

తెలంగాణ ఊటీగా అనంతగిరి కొండలకు గుర్తింపు

- సందర్శకులతో అలరారుతున్న పర్యాటక ప్రదేశాలు
- ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా ఉమ్మడి జిల్లా
- కరోనా తర్వాత మారిన ప్రజల జీవన శైలి
- పర్యాటక ప్రాంతాలకు ప్రజల పరుగులు

వికారాబాద్, సెప్టెంబరు 26: చుట్టూ ఎత్తైన కొండలు.. పచ్చని చెట్లు.. మలుపులు తిరిగే ఘాట్ రోడ్డు, చూడగానే మైమరిపించే ప్రకృతి సౌందర్యం.. వీక్షించి ఆస్వాదించాల్సిందే అనిపించే ఆహ్లాదకరమైన వాతావరణం అనంతగిరి కొండల సొంతం.. ప్రకృతి రమణీయతకు మారుపేరుగా చెప్పుకునే ఈ ప్రాంతం తెలంగాణ ఊటీగా గుర్తింపుపొందింది. ఈ సహజసిద్ధమైన కొండలు ఇక్కడకు వచ్చే భక్తులకు, సందర్శకులకు ఆధ్యాత్మికం, ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. ప్రకృతి సౌందర్యంతో అలరారుతున్న అనంతగిరి కొండలకు త్వరలో మహర్దశ పట్టనుంది. కేంద్ర పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద ఇక్కడ ఎకో టూరిజం జోన్‌గా అభివృద్ధి పరిచే పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి.



రోజుకు 3వేల నుంచి 5వేల మంది రాక

అనంతగిరి కొండల్లో 213 ఎకరాల్లో రూ.98 కోట్ల నిధులతో ఎకో టూరిజం జోన్‌గా తీర్చిదిద్దనున్నారు. కాటేజీలు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్, రోడ్లు, పార్కింగ్, ట్రాకింగ్ పాయింట్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించనున్నారు. వీటితో పాటు సమీపంలోని కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను పర్యావరణ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. అనంతగిరి కొండలు రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలో ఉండడంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. వారాంతాల్లో సుమారు 3వేల నుంచి 5వేల మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. వర్షాకాలంలో పర్యాటకుల తాడికి మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి అడవుల్లో అపారమైన ప్రకృతి సంపద, ఔషధ మొక్కలు ఉన్నాయి. వన్యప్రాణులు, వందల రకాల పక్షులున్నాయి. ఈ ప్రాంతంలో

మిగతా 6వ పేజీలో...

అడ్వెంచర్స్‌కు కేంద్రం

అనంతగిరి కొండలను అడ్వెంచర్ (సాహసకృత్యాలు) టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదం పంచేందుకు జంగిల్ రిసార్ట్‌తో పాటు ఎడ్వంచర్ టూరిజం అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. సింగపూర్, మలేషియా దేశాల్లో మాదిరిగా ఈ ప్రాంతంలో జంగిల్ రిసార్ట్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. మౌంటెన్ క్లైంబింగ్, రాక్ క్లైంబింగ్, డిర్ట్ బైక్స్, సైకిల్ ట్రాప్, జిప్‌లైన్స్, నేచర్ ట్రెక్కింగ్, స్కై డైవింగ్, బ్యాక్ ప్యాకింగ్, క్యాంపింగ్, హైకింగ్, హార్స్ బ్యాక్ రైడింగ్, స్క్యూబా డైవింగ్, బర్డ్ వాచింగ్, ఎకో టూరిజం, కెనోయింగ్, రివర్ క్రాసింగ్, అడ్వెంచర్ క్లబ్ వంటివి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే అనంతగిరి రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.


ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, రజక సంఘం నాయకులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 : వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొని ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని కొనియాడారు. కలెక్టరేట్ ఏవో సునీల్, బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్‌రామ్, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.మల్లేష్, పెండ్యాల ఉమేష్, జిల్లా అధ్యక్షుడు నరసింహ, అల్మాసుగూడ అధ్యక్షుడు జి. నాగేష్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, శ్రీనివాస్, నవీన్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాంత ప్రజలు డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలింపు


ప్రజలతో మాట్లాడుతున్న మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 : మూసీ పరీవాహక ప్రాంతంలో నివాసముంటున్న వారిలో కొందరిని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలించారు. నది పరిసర ప్రాంతమైన కొత్తపేట భవానీ నగర్ రోడ్డు నంబర్ 10లో నివాసముంటున్న వారితో గురువారం మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడారు. 11 కుటుంబాల సమ్మతితో వనస్థలిపురం, ప్రతాపసింగారం, తిమ్మాయిగూడలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ప్రభుత్వ ఖర్చులతోనే వాహనంలో వస్తు సామగ్రిని తరలించారు.

ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ కమిటీ భేటీ

హాజరైన కన్వీనర్.. జిల్లాల కలెక్టర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 26 : రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణభాగం అలైన్‌మెంట్ కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ రంగంలోకి దిగేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కమిటీ గురువారం సచివాలయంలో మొదటి సమావేశాన్ని నిర్వహించింది. సమావేశానికి కన్వీనర్‌తో పాటు దక్షిణభాగం రహదారి నిర్మాణమయ్యే జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకు ఎవరెవరు ఏయే బాధ్యతలు తీసుకోవాలనే దానిని చర్చించినట్టు తెలిసింది. కాగా కమిటీలోని అధికారులకు ఏయే బాధ్యతలు ఎవరికి కేటాయించారనే విషయాలను త్వరలో ప్రకటించనున్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని ఆందోళన


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

చేవెళ్ల, సెప్టెంబరు 26 : ఆర్టీసీ బస్సులు తక్కువ సంఖ్యలో తిరుగుతుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్య ప్రకాశ్ తెలిపారు. గురువారం హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి సంఘం నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు సరిపడా బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. పాఠశాలలు, కళాశాలలకు వేళకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్ రెడ్డి అక్కడికి చేరుకొని ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మహిపాల్, హరికృష్ణ, కిషోర్, విజయ్, ప్రశాంత్, ప్రణయ్, హరీష్, శంకర్, ప్రవళిక, నవ్య, లక్ష్మి, అశ్విని, అఖిల, శివరాజేశ్, శంకర్, నితీష్, విష్ణు ఉన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


చేవెళ్ల కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివుడు

చేవెళ్ల, సెప్టెంబరు 26 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని రిటైర్డ్ జడ్జి సాంబశివుడు తెలిపారు. గురువారం చేవెళ్ల కోర్టు ఆవరణలో ట్రాఫిక్ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 కేసులు పరిష్కరించడంతోపాటు రూల్స్ పాటించని వారికి రూ.1.30 లక్షల జరిమానాలు విధించారు. అనంతరం రిటైర్డ్ జడ్జి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనాలు నడిపేవారు తప్పక లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ట్రాఫిక్ పోలీసులు, తదితరులు ఉన్నారు.

రాయితీ.. రాదేమీ?

- అటకెక్కిన రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన
- రాజకీయ జోక్యంతో నిలిచిన ట్రాక్టర్ల పంపిణీ
- అందని వ్యవసాయ ఆధునిక యంత్రాలు, పరికరాలు
- రైతులకు భారంగా కూలీల ఖర్చు









యాచారం, సెప్టెంబరు 26 :వ్యవసాయ రంగంలో కూలీల ఖర్చు తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2017లో రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజనకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లతో పాటు వ్యవసాయ యంత్ర పరికరాలను 50 శాతం రాయితీపై రైతులకు అందించాలని కేంద్రం నిర్ణయించింది. సగం ధరలకే వస్తుండటంతో వీటిని కొనుగోలు చేయడానికి రైతులు కూడా ఆసక్తి చూపించారు.

ఒక్క ఏడాదితో సరి..

ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందజేయడానికి 2017-18 సంవత్సరంలో జిల్లాకు సుమారు రూ.70కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అప్పుడు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మండలానికి రెండు చొప్పున ట్రాక్టర్లను పంపిణీ చేశారు. యాచారం మండలానికి రెండు, మంచాలకు రెండు, ఇబ్రహీంపట్నంకు ఒక ట్రాక్టర్ చొప్పున అందించారు. అయితే ఈ ట్రాక్టర్లు అర్హులైన రైతులకు అందలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. వాహనాల పంపిణీలో రాష్ట్రంలోని అధికార పార్టీ నాయకుల జోక్యం ఎక్కువైందని విమర్శలు కూడా వచ్చాయి. నాయకుల అనుచరులకు మాత్రమే అవి అందాయని అర్హులైన రైతులు గగ్గోలు పెట్టారు. ఈ ఆరోపణలతో అప్పటి నుంచి సబ్సిడీపై ట్రాక్టర్ల పంపిణీకి మంగళం పాడారు.

రైతులపై ఆర్థిక భారం

వ్యవసాయం చేస్తే ఏం లాభం లేదని అభిప్రాయంతో ఉన్న రైతులపై పరికరాల కొనుగోలు మరింత ఆర్థిక భారం పడింది. అసలే పెట్టుబడి, కూలీల ఖర్చు భరించలేక అవస్థపడుతున్న నేపథ్యంలో ట్రాక్టర్లు, రోటవేటర్లు, హార్వెస్టర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు కొనుగోలు చేయలేక చాలామంది వ్యవసాయానికి దూరం అవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రాయితీ నిలిపివేయడం.. సహకార, వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వకపోవడంతో కొందరు రైతులు ప్రైవేటు ఫైనాన్సులను ఆశ్రయిస్తున్నారు. ఇలా అప్పులు చేసి ట్రాక్టర్ కొనుగోలుకు చేయడం ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన

ఇటీవల కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు యాచారం మండలంలోని గడ్డమల్లాయగూడలో డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా రసాయన ఎరువులు చల్లే విధానం గురించి వివరించారు. ట్రాక్టర్లు, మినీట్రాక్టర్లు కొనలేని రైతులు ఖరీదైన డ్రోన్లు ఎలా కొంటారని కొందరు అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాభై శాతం రాయితీపై యంత్ర పరికరాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వాటిని కూడా మండల సొసైటీల ద్వారా ఇప్పించాలంటున్నారు.


సబ్సిడీపై ట్రాక్టర్లు, పరికరాలు అందించాలి



యాభై శాతం రాయితీపై రైతులకు ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్లు, రోటోవేటర్లు. ఆధునిక నాగళ్లను అందించాలి. డ్రోన్లు కూడా తక్కువ ధరలకు అందిస్తే బాగుంటుంది. వ్యవసాయం వైపు యువతను ప్రోత్సహిస్తూ పరికరాలను రాయితీపై అందిం చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొంగర శివ, రైతు, చౌదర్‌పల్లి

నేడే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
1.00,4.30,8.00,11.30,3.00,6.30,10.00

సంధ్య 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
4.00,7.30,11.15,2.30,6.00,9.45

సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
4.15,7.45,11.15,2.30,6.30,9.30

దేవి 70 - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ (ఒక రోజు మాత్రమే)
1.00,4.30,8.00,11.30,3.00,6.30,10.00

SVC సంగీత 70 - ఆర్.సి.పురం 4.30,8.00,11.30,3.00,6.30,10.00
SVC ఈశ్వర్ 70 - అత్తాపూర్ 4.00,8.00,11.30,3.00,6.30,10.45
SVC శ్రీలక్ష్మి /ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 4.00,4.00,4.05,7.30,7.35,8.00,11.00,11.10,11.30 2.35,2.45,3.00,6.10,6.20,6.30,9.45,9.55,10.00
SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 7.30,11.00,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్
శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి

నేడే బ్రహ్మాండమైన విడుదల



రేపే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.30,6.00,9.30

మల్లిఖార్జున 70ఎంఎం - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ 11.15,6.15
స్వప్న - కాటెదాన్ 2.00,9.00
శ్రీరమణ 35ఎంఎం ఎ/సి - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
భుజంగ 70ఎంఎం ఎ/సి - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
తారకరామ 70ఎంఎం ఎ/సి - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00
లక్ష్మీ 70ఎంఎం ఎ/సి - శంషాబాద్ 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ వేవ్‌షైర్ 70 - ఖైరతాబాద్ 2.45pm

GLOBAL CINEMAS RELEASE

అనంతగిరి.. పర్యాటక సిరి

(ఐదో పేజీ తరువాయి)

సినిమా, టీవీ షూటింగ్‌లు జరుగుతుంటాయి. ఇటీవల కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్, కాయకింగ్‌ను కూడా ప్రారంభించారు.

మార్కండేయ మహర్షి తపోభూమి..

శివ భక్తాగ్రేసురుడైన మార్కండేయ మహర్షి తపోభూమి.. శ్రీమహావిష్ణువు అనంత పద్మనాభస్వామిగా కొలువుదీరిన క్షేత్రమే అనంతగిరి. రాష్ట్ర రాజధానికి 75 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. ఈ ఆలయం నిజాం నవాబుల పాలనలో వెలుగులోకి వచ్చింది. ఆలయం నుంచి కింద వైపుగా పుష్కరిణికి వెళ్లే మెట్ల మార్గంలోనే మార్కండేయ మహర్షి తపోభూమి దర్శనమిస్తుంది. అలాగే కింది భాగంలో మూసీనది ఉద్భవించిన భావనాశిని పుష్కరిణి, పురాతన శివాలయం ఉంది. భక్తుల కోరికలు తీర్చే అనంత వల్లభునిగా ఖ్యాతిగాంచిన పద్మనాభస్వామి దేవాలయం 13వ శతాబ్దం నాటిదనేది చరిత్రకారుల వాదన. ఔరంగజేబు కాలంలో గోల్కొండ నవాబు ఈ ఆలయాన్ని నిర్మించాడని పురాణాలు వివరిస్తున్నాయి. ఈ ఆలయ నిర్మాణంలో మహ్మదీయ శైలి కనిపిస్తుంది. గతంలో అనంతగిరి ప్రాంతమంతా దట్టమైన అడవులు, కొండలు, గుహలతో నెలకొని మునులకు నిలయంగా ఉండేదని ప్రతీతి. ముచుకుందుడు అనే రాజర్షి అనంతపద్మనాభస్వామి పాదాలు అభిషేకించిన స్థలంలోనే మూసీనది జన్మించిందనేది చరిత్ర కథనం.

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

అనంతగిరి కొండల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. లోతైన లోయలు, వంపులు తిరిగిన రోడ్డు మలుపులు, పచ్చని చెట్ల సమూహాలతో అనంతగిరి కొండలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సముద్ర మట్టానికి సుమారు రెండున్నర వేల అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండలు ఓ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. పర్యాటక శాఖ



ఆధ్వర్యంలో హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్ నిర్మాణం చేపట్టారు. సందర్శకుల కోసం కాటేజీలు, స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఈ రిసార్ట్ సందర్శకులతో కిటకిటలాడుతూ ఉంటుంది. పర్యాటకులు ఆన్‌లైన్‌లో గదులు రిజర్వు చేసుకుని ఇక్కడకు వస్తుంటారు.

బోటింగ్‌కు అడ్డా కోట్‌పల్లి

వికారాబాద్ జిల్లాలోనే అతి పెద్దది కోట్‌పల్లి ప్రాజెక్టు. 9,200 ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన ఈ ప్రాజెక్టు ప్రముఖ సందర్శనీయ స్థలంగా పేరు గాంచింది. వర్షాకాలంలో ఇక్కడికి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికే కాకుండా కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపడానికి కూడా ఇక్కడికి చాలా మంది వస్తుంటారు. కోట్‌పల్లి ప్రాజెక్టులో కాయకింగ్ బోటింగ్ సౌకర్యం ఉండడంతో అనంతగిరికి వచ్చే పర్యటకులు కోట్‌పల్లికి వచ్చి బోటింగ్ చేస్తుంటారు. బోటింగ్ చార్జీలు రూ.300 నుంచి రూ.1000 వరకు ఉంది. అదే విధంగా పరిగి నియోజకవర్గంలోని లక్నాపూర్ ప్రాజెక్టు సైతం పర్యాటకులను కనువిందు చేస్తోంది.



రకరకాల పక్షులకు నెలవు

రంగారెడ్డి జిల్లా పరిధిలోని హిమాయత్ సాగర్, గండిపేట జలాశయాలు ప్రముఖ సందర్శనా స్థలాలుగా గుర్తింపు పొందాయి. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ జలాశయాలకు నగరవాసులే కాకుండా ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది సందర్శకులు నిత్యం వస్తుంటారు. సెలవుల్లో రోజంతా కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడే సరదాగా గడపడానికి ఆసక్తి కనబరుస్తారు. జలాశయాలకు వెళ్లే దారిలోనే ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు కూడా కొత్తగా చూసేవారికి చక్కటి అనుభూతిని కలిగిస్తుంది. అలాగే జంటనగరాల నుంచి 44 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ చెరువు రకరకాల పక్షులకు నెలవుగా పేరుగాంచింది. ఇక్కడి చల్లటి వాతావరణం కారణంగా వేసవిలో సేదతీరడానికి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. వారాంతంలో ఎంజాయ్ చేయడానికి నగరం నుంచి ఉద్యోగులు, యువత ఇక్కడికి వస్తుంటారు.



వికారాబాద్‌లో చూడదగ్గ ప్రదేశాలు

కుల్కచర్ల పాంబండ, కొడంగల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, తాండూరులో భూకైలాస్, భద్రేశ్వర ఆలయం, జుంటుపల్లి సీతారాముల దేవాలయం, ఏకాంబరేశ్వరాలయం, పూడూరు దామంగం రామలింగేశ్వర స్వామి, పరిగి వేంకటేశ్వర స్వామి దేవాలయం, వికారాబాద్ శ్రీ బుగ్గరామలింగేశ్వర ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలుగా కొలువైనాయి. ఇక్కడ దైవ దర్శనంతో పాటు చుట్టురా ఉన్న ప్రదేశాలు భక్తులను, పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

స్వచ్ఛమైన తాగు నీటినందించాలి

- ప్రతీరోజు పరీక్షించిన తర్వాతే సరఫరా చేయాలి
- వాటర్‌మెన్లకు ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చంద్రమౌళి సూచన



మాట్లాడుతున్న చంద్రమౌళి

యాచారం, సెప్టెంబరు 26 : వాటర్‌మెన్‌లు ప్రతీరోజు ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలని, తాగునీటిని విధిగా పరీక్షించిన తర్వాతనే సరఫరా చేయలాని రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చంద్రమౌళి సూచించారు. వాటర్‌మెన్ ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రజలు రోగాలబారిన పడతారని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో వాటర్‌మెన్‌లకు తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు ఇస్తున్న నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. సీఈ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాటర్‌మ్యాన్ గ్రామానికి ఓ వైద్యుడి లాంటివారనే విషయం గమనంలో పెట్టుకోవాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను నిత్యం పరీక్షించుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో నిధుల కొరత లేదని, ప్రభుత్వం కొత్తగా ట్యాంకులు నిర్మించడంతో పాటు మరమ్మతులకు నిధులు కేటాయిస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వాటర్‌మెన్‌లకు సర్టిఫికెట్లను సీఈ, ఈఈ, ఎంపీడీవోలు అందజేశారు. ఈఈ రాజేశ్వర్‌రావు, డీఈ రాజు, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏఈ సుభాష్, మిషన్‌భగీరథ ఏఈ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


బంకులో నీళ్లు కలిసిన పెట్రోల్

- వాహనదారుల అవస్థలు.. సిబ్బందిపై మండిపాటు



నీళ్లు కలిసిన పెట్రోల్ చూపిస్తున్న వాహనదారుడు

పెద్దేముల్, సెప్టెంబరు 26: ఎస్సార్ పెట్రోల్‌పంపులో కల్తీ పెట్రోల్ కలకలం రేపింది. పెట్రోల్ పోయించుకున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెట్రోల్ పోయించుకున్న వాహనాలు కొద్దిదూరం వెల్లగానే మొరాయించడంతో స్థానికంగా ఉన్న మెకానిక్‌లను ఆశ్రయించారు. మెకానిక్‌లు పరిశీలించి పెట్రోల్‌లో నీళ్లు కలవడంతోనే బండి మొరాయించిందని చెప్పడంతో వాహనదారులు ఆగ్రహానికి గురయ్యారు. పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామసమీపంలోని ఎస్సార్ పంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో దిగివచ్చిన యాజమాన్యం వాహనదారులు ఎంత పెట్రోల్ వేయించుకున్నారో అంత డబ్బులు తిరిగి ఇప్పించారు. కాని నీళ్లు కలిసిన పెట్రోల్ వల్ల వాహనం ఇంజిన్ పాడైతే దానికి బాధ్యత తీసుకునేది ఎవరని వాహనదారులు ప్రశ్నించారు. దానికి పెట్రోల్ పంపు యాజమాన్యం నుంచి సమాధానం లేదని వాహనదారులు వాపోతున్నారు. విషయాన్ని పెద్దేముల్ మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఇవిల్ సప్లయి అధికారులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారని వాహనదారులు మండిపడ్డారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా కల్తీ పెట్రోల్‌పై తమకు ఫిర్యాదు వచ్చిందని, అయితే అది సివిల్ సప్లయి వారి బాధ్యత కాబట్టి వారికి ఫిర్యాదు చేయాలని వాహనదారులకు సూచించామని చెప్పారు. సివిల్ సప్లయి అధికారులు తమకు ఫిర్యాదు చేస్తే పెట్రోల్ పంపు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.



సిబ్బందిని నిలదీస్తున్న వాహనదారులు

పరిసరాల శుభ్రతకు పాటుపడాలి



విద్యార్థులు మానవహారం

శంకర్‌పల్లి, సెప్టెంబరు 26: పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో కలిసి శంకర్‌పల్లిలో మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండిలో వేయాలని, ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మేనేజర్ అంజన్‌కుమార్, నాయకులు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వరకూ తల్లిపాలు పట్టించాలి : సీడీపీవో



లేమూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో సరిత

కందుకూరు, సెప్టెంబరు 26: పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లిపాలను పట్టించాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ, ఎండీవో సరితలు సూచించారు. గురువారం మండలంలోని లేమూరు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లేమూరు వైద్యాధికారి స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్లుగా మొగులయ్య, కిషన్‌నాయక్

ఎస్సీ, ఎస్టీ కోటాలో ఏకగ్రీవం.. కొత్త డైరెక్టర్లకు ఘన సన్మానం



కొత్తగా డైరెక్టర్లుగా ఎన్నికైన మొగులయ్య, కిషన్ నాయక్‌లను సన్మానిస్తున్న డీసీసీబీ పాలకవర్గం

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) కార్యవర్గ సమావేశాన్ని గురువారం నాంపల్లిలోని డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ కోటాలో కొత్తగా ఇద్దరు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మాజీ డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానం చేసి ఆమోదించారు. కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లను డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బ్యాంకు అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంగం రవీందర్‌గౌడ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోలీస్ రాంరెడ్డి, బుర్కుంట సతీష్, పీజీవీ రాణి, సైదా పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన అటవీ శాఖ అధికారి



వికారాబాద్, సెప్టెంబరు 26: వికారాబాద్ జిల్లా న్యాయమూర్తి సున్నపు శ్రీనివాస్‌ను జిల్లా అటవీశాఖ అధికారి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం న్యాయమూర్తి కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

ఆమనగల్లు, సెప్టెంబరు 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ సమావేశానికి భూపాల్, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి. కవిత లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 30న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భూపాల్ తెలిపారు. కార్మికులు ఉప్పెనలా కదిలి రావాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఐక్యత ఫౌండేషన్



ఆర్థికసాయం అందిస్తున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 26: నిరుపేదనిరుద్యోగ యువతకు ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం బండోనిపల్లికి చెందిన ఏకుల అర్జున్ కుటుంబం కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతోంది. ఐక్యత ఫౌండేషన్ ద్వారా అర్జున్ కుటుంబ జీవనోపాధి కల్పనకు గురువారం రూ.43 వేలు ఆర్థికసాయం అందజేశారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సుంకిరెడ్డి సూచించారు. ఫౌండేషన్ సభ్యులు రవి, ఉపేందర్, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, అభినవ్‌రెడ్డి ఉన్నారు.

బేషరుతుగా పంటరుణం మాఫీ చేయాలి



నిరసనలో రైతు ఐక్యవేదిక నాయకులు, రైతులు

కేశంపేట, సెప్టెంబరు 26: రైతులు తీసుకున్న పంటరుణాలను బేషరుతుగా మాఫీ చేయాలని కేశంపేట రైతువేదిక నాయకుడు శివాజీ డిమాండ్ చేశారు. గరువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శివాజీ ఆధ్వర్యంలో రుణాలు మాఫీ చేయాలని కోరుతూ ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీపై పూటకోమాట చెబుతోందని, ప్రభుత్వం చెప్పిన గడువు ముగిసినా రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. గ్రామాల్లో సగం మంది రైతులకే మాఫీ అయ్యిందని మిగతా వారు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ రైతు భరోసా ఇవ్వలేదన్నారు. వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరారు. ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మీర్ ఆజంఅలీకి వినతిపత్రం అందించారు. మంచె ఈశ్వరయ్య, యాదయ్య, ప్రవీణ్, రాములు, మల్లేష్, అమ్రేష్, కిష్టయ్య ప్రవీణ్‌రెడ్డి, శంకర్, రామ్, ఎండీ ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6.5కోట్ల నిధులు వెనక్కి

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ధోబీ ఘాట్‌ల నిర్మాణాలకు శాశ్వత బ్రేక్



మేడ్చల్‌లో నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 26: స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మేడ్చల్ మున్సిపాలిటీలో గత ప్రభుత్వం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ధోబీ ఘాట్‌ల నిర్మాణాలకు శాశ్వతంగా బ్రేక్ పడింది. గత ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ నిధులను రద్దుచేస్తూ ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఆదేశాలు జారీ చేయటంతో ఈ రెండు పనులు శాశ్వతంగా నిలిచిపోయాయి. 2021 వార్షిక బడ్జెట్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలకు బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించింది. అందులో భాగంగా మేడ్చల్ పట్టణానికి రూ.4.5కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు పట్టణంలో ఆర్ అండ్ బీ భవన ప్రాంగణంలోని స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే పరిస్థితులు అనుకూలించకపోవటంతో పట్టణంలోని కేఎల్ఆర్ ఫేస్-3 సమీపంలోని ప్రభుత్వ స్థలంలో మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రతిపాదించారు. అనంతరం స్థానిక మున్సిపల్ అధికారులు మార్కెట్ నిర్మాణం చేపట్టడానికి టెండర్ కాల్ చేసి కాంట్రాక్టర్‌కు బాధ్యతలనూ అప్పగించారు. కాగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ నిధులు మాత్రం విడుదల కాలేదు. నిధులు కేటాయించే విషయంలో స్పష్టత లేకపోవటంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేశాడు. అప్పటికే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి కాంట్రాక్టర్ దాదాపు రూ.50లక్షల వరకు ఖర్చుచేశాడు. టెండర్ కాల్‌చేసి నిర్మాణ బాధ్యతలు అప్పగించిన అధికారులను నిధుల గురించి అడిగినప్పటికీ వారి వద్ద నుంచి స్పష్టత లేకపోవటంతో కాంట్రాక్టర్ చేసిన పనులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. దీంతో సదరు కాంట్రాక్టర్ ఈ పనులకు శాశ్వతంగా నిలిపివేశాడు. తాను పెట్టిన డబ్బులు రాబట్టుకోవడానికి మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నాడు. అదేవిధంగా 2021లో ప్రభుత్వం మున్సిపల్‌లో ధోబీ ఘాట్ ఏర్పాటు చేయటానికి రూ.2 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్మాణాన్ని పెద్ద చెరువు, తుమ్మ చెరువులో చేపట్టే విషయంలో స్థానిక ప్రజాప్రతినిదుల మధ్య ఏకాభిప్రాయం కుదరక కాలయాపన జరిగింది. చివరికి మేడ్చల్ పెద్ద చెరువులో నిర్మించాలని నిర్ణయించి టెండర్ వేశారు. పనులు చేపట్టడానికి ఒక కాంట్రాక్టరు ముందుకు వచ్చాడు. కాగా అప్పటికే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పరిస్థితి చూసి ధోబీ ఘాట్ పని బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా వదిలేశాడు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేయటంతో ఈ పనులకు శాశ్వతంగా బ్రేక్ పడినట్లు అధికారులు తెలిపారు.

సమయస్ఫూర్తి వ్యవహరించని ప్రజాప్రతినిధులు

గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి రాష్ట్ర కేబినేట్‌లో కీలక మంత్రిగా ఉన్నారు. దీనికి తోడు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. అయినప్పటికీ వారు మార్కెట్, ధోబీఘాట్ కోసం కేటాయించిన బడ్జెట్ నిధులను విడుదల చేయించలేకపోయారు. మంత్రి హోదాలో ఉన్న మల్లారెడ్డి కాస్త ఆసక్తి కనబరిచి వుంటే నేడు స్థానికంగా అభివృద్ధి పనులు జరిగేవని కొందరు స్థానిక నేతలు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మెతక వైఖరి వల్ల ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినబడుతున్నాయి.

నిధులు వస్తే కదా



ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం వాస్తవమే. అయితే ఈ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప నిధులు విడుదల చేయలేదు. దీంతో టెండర్లు వేసి కాంట్రాక్టర్లను కాల్‌ఫర్ చేశాం. కాగా కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. దీంతో పెండింగ్ పనులను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

- నాగిరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

పోలీసులు ప్రజల కోసమే పనిచేయాలి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మర్పల్లి, సెప్టెంబర్ 26: పోలీసులు ప్రజలకోసమే పనిచేయాలని, ప్రభుత్వం కోసం కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన నవీన్, ప్రవీన్ ఇద్దరు దళిత సోదరులను ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి కేసులో పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టారన్న విషయం తెలుసుకున్న ఆమె గురువారం బాధితులను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పరామర్శించారు. సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. పట్లూర్ గ్రామంలో దొరికిన గుర్తుతెలియని మృతదేహం మీ పెద్దనాన్నదే అంటూ ఆధారాలు లేకుండా తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. ముందుగా లభ్యమైన మృతదేహం ఎవరిదో తెలుసుకొని చట్టప్రకారం వెళ్లాలని ఆమె సూచించారు. మృతదేహం ఎవరిదో తెలుసుకోవడంతో పాటు నవీన్ పెద్దనాన్న మిస్సింగ్ కేసును ఛేదించాలన్నారు. పోలీసులు, అధికారులు కొంత కాలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తల పట్ల, నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ ఘటన పట్లూర్‌కే పరిమితం కాదన్నారు. బూచన్‌పల్లి, కొంశెట్‌పల్లి గ్రామాల్లోనూ బీఆర్ఎస్ నాయకుల పట్ల పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిత్యం పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆటో డ్రైవర్లు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వస్తే అమానుషంగా చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. మర్పల్లి మండలం చాలా వెనుకబడి ఉందని, పోలీసులు న్యాయం చేయకపోతే ఎక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితిలో ఇక్కడి ప్రజలు ఉంటారన్నారు.

ప్రభుత్వాలు శాశ్వతం కాదు

ప్రభుత్వాలు శాశ్వతం కాదని, ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తే సామాన్య ప్రజలకు ఎవరు న్యాయం చేస్తారని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ పోలీసుల పనితీరుపై డీజీపీకి, వికారాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే ఐజీకి ఫిర్యాదు చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేలా చూస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మధుకర్, మోహన్‌రెడ్డి, అశోక్, రాచన్న, మధుకర్ తదితరులు ఉన్నారు.

గుర్రం దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గుర్రం దాడిలో గాయలపాలైన గుడ్‌సాబ్

బషీరాబాద్, సెప్టెంబరు 26: ఓ వ్యక్తిపై ఒక్కసారిగా గుర్రం దాడికి దిగింది. అంతటితో ఆగకుండా నోటితో కొరికి బట్టలను ఊడదీసి పరుగులు పెట్టించింది. దీంతో సదరు వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బషీరాబాద్ మండలం జీవన్గి శివారులో గురువారం వెలుగుచూసింది. బాధితుడి కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం సరిహద్దు కర్ణాటక ప్రాంతంలోని జెట్టూరు గ్రామానికి చెందిన గుడ్‌సాబ్(23) ఒక గుర్రాన్ని పోషిస్తున్నాడు. ఏదైనా ఊరెళ్తే ఈ గుర్రంపైనే సవారీ చేస్తుంటాడు. కాగా గురువారం ఉదయం అతడి గుర్రం ఇంటి వద్ద నుంచి పారిపోయింది. ఈ క్రమంలో వెతుక్కుంటూ సమీప జీవన్గి గ్రామ శివారులోకి వచ్చాడు. అక్కడున్న అతడి గుర్రాన్ని పట్టుకునేందుకు వెళ్లగా అక్కడే పొదల్లో ఉన్న మరోగుర్రం పరుగెత్తుకొచ్చి దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా వెంబడిస్తూ నోటితో కొరికి బట్టలను ఊడదీయగా గుడ్‌సాబ్ తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ గుర్రం దాడిలో అతడి చేతివేలు తెగిపోయింది. ప్రాణ భయంతో పరుగులు తీస్తూ కిలోమీటరు దూరంలోని జీవన్గి ప్రధాన రోడ్డు వరకు వ్యవసాయ పొలాల బురదలోంచి, ఒంటిపై దుస్తులు లేకుండా పరిగెత్తుకొచ్చి ప్రాణపాయ స్థితినుంచి బయటపడ్డాడు. తీవ్రగాయాలతో ఉన్న అతన్ని స్థానికులు చూసి అతడి బావ హసన్‌ను పిలిపించి బాధితుడిని ఆటోలో ఎక్కించి తాండూరు జిల్లా ఆస్పత్రికి పంపించారు. అక్కడి వైద్యులు బాధితుడిని పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

రాష్ట్రంలో ఆరాచక పాలన

నవాబుపేట: తెలంగాణ రాష్ట్రంలో ఆరాచక పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని నారేగూడ గ్రామంలో రైతురుణమాఫీ కాని రైతులతో గురువారం ఆమె మాట్లాడారు. రుణమాఫీ అయ్యేంత వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. రైతు రుణమాఫీ కాలేదని ప్రజాభవన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులతో అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజాభవన్‌కు వెళ్లి తమ గోడును తెలియజేసేందుకు ప్రయత్నించిన రైతులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. రైతులతో బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రుణమాఫీ అయ్యేంత వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వర్షాలుపడే సమయంలో రైతుబంధు ఒకేసారి ఖాతాల్లో జమ చేసేవారమని తెలిపారు. ప్రస్తుతం రుణమాఫీ చేయడంలో ఆధార్‌లో, బ్యాంకు ఖాతాల్లో తప్పులను సాకుగా చూపించడం ఎంత వరకు సమంజసమన్నారు. రూ.41లక్షల కోట్ల రుణమాఫీ కావాల్సి ఉందని చెబుతూ పూటకో మాట మార్చి రైతులను నట్టేటా ముంచారని ఆరోపించారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసేంత వరకు ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటూ పోరాటం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మాట్లాడుతూ గ్రామంలో పదిహేను రోజులుగా విద్యుత్, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా రావడంలేదన్నారు. దీన్నిబట్టి కాంగ్రెస్ పాలన ఏవిధంగా ఉందో ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భరత్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రైతులు కమాల్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, విఠలయ్య, రమేశ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి బీజేపీలో చేరండి : ఎంపీ అరుణ



సభ్యత్వాన్ని ఇస్తున్న డీకె అరుణ

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 26: దేశ సమగ్రాభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు బీజేపీలో చేరాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం, రాయికల్ గ్రామాలతో పాటు షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గురువారం సాయంత్రం అరుణ పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ సభ్యత్వ కార్యక్రమం దేశవ్యాప్తంగా సజావుగా సాగుతున్నదని, మోదీ పాలనను చూస్తున్న మహిళలు సైతం స్వచ్ఛందగా బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో సైతం అధికారమే లక్ష్యంగా సభ్యత్వాలు చేయించడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయాలని భావించేవారు సభ్యత్వ కార్యక్రమాల్లో చురుకైన పాత్రను పోషించాలని అరుణ పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, వెంకటేష్ గుప్తా, పాతపల్లి కృష్ణారెడ్డి, కందూరు మనోహర్‌రెడ్డి, మచ్చ సుధాకర్‌రావు, అమడాపురం నర్సింహాగౌడ్, విజయ్‌భాస్కర్, చెట్ల నర్సింహా, వంశీకృష్ణ, ఇస్నాతి శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌నాయక్, లష్కర్‌నాయక్, వెంకనోళ్ళ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలి

ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



జోనల్ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో అతిథులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ 17, అండర్ 14 బాలురు/బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లు అందజేయనున్నట్లు ప్రకటించారు. ముగింపు టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ఆడనున్న క్రీడాకారులకు ఏసీపీ కేపీవీ రాజు చేతులమీదుగా బహుమతులందజేశారు. పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, జోనల్ సెక్రటరీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు రూరల్ సెప్టెంబరు 26: మండలంలోని అంతారం అసైన్డ్ భూముల్లో అక్రమార్కులు భారీగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని 'అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మైన్స్ అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల రెవెన్యూ, మైన్స్ అధికారులు ఆర్ఐ గోపి, నిర్మల గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే నెంబర్-58లో ఏ మేరకు తవ్వకాలు జరిపారు? అనుమతులు ఉన్నాయా? అనే దానిపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ తవ్వకాలు చేపట్టిన పెద్ద హిటాచీ ఉండటంతో రెవెన్యూ ఆర్ఐ గోపి, మైన్స్ ఆర్ఐ నిర్మల అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వాటిని సీజ్ చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు రాజకీయ పలుకుబడి ఉపయోగించడంతో విచారణకు వెళ్లిన అధికారులు వెనుదిరిగి వెళ్లారు. అయితే అంతారం గ్రామస్తులు మాత్రం ఎంత మేరకు తవ్వకాలు జరిపారు? మైన్స్, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారు? అనే విషయాలను తెలుసుకున్నారు. తవ్వకాలు జరిపిన వారికి చర్యలు చేపట్టి పెనాల్టీ వేయాల్సి ఉండగా, అధికారులు వెనుదిరిగి వెళ్లడంతో కాంట్రాక్టర్లపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు నిలిపివేయకపోతే పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డిని దేవుడే చూసుకుంటాడు

- ఆయన అన్ని దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పారు
- ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్లు.. గట్టిగా మాట్లాడితే దాడులు
- మంచిగా ఉన్న రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తుండు
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలుస్తుండు
- రైతు రుణమాఫీ అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవాబుపేట మండలం నారేగూడ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

వికారాబాద్/నవాబుపేట : రేవంత్‌రెడ్డిని దేవుడు చూసుకుంటాడని, ఆయన ఎన్నికల సమయంలో ప్రతీ ఒక్క దేవునిపై ఒట్లు వేసి మాట తప్పారని, చివరికి అనంతగిరి అనంతపద్మనాభ స్వామిపై కూడా ఒట్టు వేశారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం నారేగూడం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పర్యటించారు. 15 రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రైతు రుణమాఫీ చేయాలని నారేగూడం నుంచి హైదరాబాద్‌కు వస్తున్న రైతులను పోలీసులు అరెస్ట్ చేశారని, ఈ విషయం తెలుసుకొని మిమ్మల్ని కలవాలని వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కేసీఆర్ చినుకు పడితే చాలు రూ. 10 వేలు వేసే వారని, రేవంత్ రెడ్డి రైతు భరోసా పేరుతో రూ.15 వేలు వేస్తామంటే ప్రజలు, రైతులు నమ్మి ఓట్లు వేశారని తెలిపారు. కానీ రైతులకు ఆ పది వేలు కూడా వేయడం లేదని మండి పడ్డారు. రైతు భరోసా డబ్బులు కౌలు రైతుకు కూడా వేస్తామని నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో అసెంబ్లీ సాక్షిగా రైతు పండించిన ప్రతీ పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు సన్నవడ్లు పండించిన వారికే అనడం దారుణమన్నారు. కేంద్రం నుంచి ఉపాధి హామీ పనుల డబ్బులు వస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ మధ్యనే కామారెడ్డి జిల్లాలో రైతులు రుణమాఫీ వివరాల కోసం బ్యాంక్ వద్దకు పోతే అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ఎక్కువ తక్కువ మాట్లాడితే కేసులు పెడుతామని పోలీసులు బెదిరించారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం బెదిరింపు పాలన సాగిస్తుందన్నారు. మహిళలకు 2500 పింఛన్లు, సబ్సిడీ గ్యాస్, ఉచిత కరెంటు ఇలా 420 మాటలు చెప్పి ఇప్పుడు ఏ ఒక్క హామీ నెరవేర్చడం లేదని తెలిపారు. మళ్లీ రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శం

- జయంతి వేడుకలో ఎమ్మెల్యేలు, నాయకులు
- ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాల వద్ద ఘన నివాళి


శంషాబాద్ : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, శంకర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 26: పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాన్ని గురువారం షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్‌లతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, రజక సంఘం నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు చాకలి ఐలమ్మ వీరత్వాన్ని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు పి.వెంకట్‌రాంరెడ్డి, బాబర్‌ఖాన్, జి. బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూరి బస్వం, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, చలివేంద్రంపల్లి రాజు, ఇబ్రహీం, ఖదీర్, అశోక్, సింగిల్ విండో చైర్మన్ బక్కన్నయాదవ్, బీఆర్ఎస్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్, దేవేందర్‌యాదవ్, పి. లక్ష్మీ నర్సింహారెడ్డి, ఈశ్వర్‌రాజు, ఈగ వెంకట్‌రాంరెడ్డి,చల్లా పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఒగ్గు కిషోర్, రజక సంఘం నాయకులు పెంటయ్య, రాంచందర్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిల్ కేంద్రంలో గురువారం ఐలమ్మ జయంతి నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆయిల్‌కుమార్ తదితరులు సిద్ధాంతి బస్తీలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తాతో పాటు పలువురు కౌన్సిలర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


యాచారం : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిషేక్‌రెడ్డి, తదితరులు

షాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన అమరజీవి చాకలి ఐలమ్మ అని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. మండల కేంద్రంతో పాటు చందన్‌వెల్లిలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : యావత్ మహిళా లోకానికి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల రజక సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే తదితరులు ఐలమ్మకు నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్, యాదయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు ఆంజనేయులుగౌడ్, కృష్ణారెడ్డి, దేవుని శర్వలింగం, పాండు, శ్రీనివాస్, గుండాల శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, రవీందర్, గోపాల్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సాయికుమార్ రెడ్డి, చేవెళ్ల మండల రజక సంఘం అధ్యక్షుడు సిహెచ్. శ్రీనివాస్, రజక సంఘం నాయకులు డివిజన్ పరిధిలో వివిధ మండలాల రజక సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కడ్తాల్ : వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డిలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో రజక సంఘం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, రజక సంఘం నేతలు పెద్దసంఖ్యలో పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, దోనాదుల మహేశ్, రవీందర్ రెడ్డి, లాయక్‌అలీ, వెంకటయ్య, రాజేందర్, నర్సింహ్మ, బాల్‌రాజ్, కరుణాకర్, వెంకటేశ్, కృష్ణయ్య, శేఖర్,అంజయ్య, కాంతయ్య, రాజేశ్, మల్లేశ్, మహేశ్, వేణు, శ్రీశైలం, సురేశ్, టిల్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు. రావిచెడ్‌లో ఐలమ్మ జయంతిలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు. నాయకులు విఠలయ్యగౌడ్, మహేందర్ రెడ్డి, రవి, జంగయ్య, పారేశ, జనార్ధన్ , మల్లేశ్, డాక్టర్ శ్రీ ను, బాలకృష్ణ, లింగం, రాములు, కృష్ణయ్య, సుమత మ్మ, యాదమ్మ, రాంచంద్ర, రమేశ్, తదితరులున్నారు.


షాద్‌నగర్ అర్బన్ : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఆమనగల్లు : పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, రజక సంఘం నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తలకొండపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్, పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్య, నాయకులు యాదయ్య, గణేశ్, కృష్ణ, కిరణ్, మహేశ్, శ్రవణ్, రవీందర్, తరుణ్, రవి, రాజు, సంతోష్, వీరేశ్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం : ఐలమ్మ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి తెలిపారు. యాచారంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఉప్పల భాస్కర్, పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

శంకర్‌పల్లి : ఐలమ్మ సేవలు మరువలేనివని సీఐటీయూ సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. శంకర్‌పల్లిలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సత్యం, కృష్ణ, శరణప్ప, అంజయ్య, జయమ్మ తదితరులు ఉన్నారు.

కందుకూరు : ఐలమ్మను యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, రజకాభివృద్ధి సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్‌లు కోరారు. మండల కేంద్రంలో జడ్పీటీసీ, నేదునూరులో వెంకటేష్ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాణాప్రతాప్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, అజీజ్, లచ్చానాయక్, జగదీష్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, రూప్ చందర్, ఎండీ అఫ్జల్‌బేగ్, ఉన్ని వెంకటయ్య, బి.శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ఐలమ్మను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని కేశంపేట మండల రజక సంఘం అధ్యక్షుడు వెంకటాపురం రాములు అన్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో కుమార్, లాలయ్య, రాములు, రవి, శంకరయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రజాకార్లను ఎదిరించి భూమి, భుక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, రాజేందర్, రమేశ్, భాస్కర్, జగ్గయ్య, హరికృష్ణ, గుంటి చరణ్, చిన్ని సాగర్, అనంత రమేశ్, కొమ్ము గోపాల్, కొమ్ము జంగారావు, మహేశ్‌యాదవ్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శంషాబాద్ రూరల్ : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


కడ్తాల : ఐలమ్మ జయంతి వేడుకల్లో లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

క్రైం కార్నర్

ముగ్గురు గంజాయి విక్రేతల రిమాండ్

- 100 గ్రాముల గంజాయి, 3 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 26: ఇబ్రహీంపట్నం టౌన్‌లో గంజాయి సేవిస్తూ ఇతరులకు సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని గురువారం రిమాండ్‌కు పంపారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక ప్యాషన్‌ప్రో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం త్రిశక్తినగర్‌కు చెందిన బోళ్ల వంశీధర్ అతడి స్నేహితులు చెరుకుపల్లి కృపాకర్‌రెడ్డి, పగడాల నితిన్‌సాయిలు వంశీధర్‌కు చెందిన త్రిశక్తి నగర్‌లోని ఓ రేకుల షెడ్డులో గంజాయి సేవిస్తుండగా పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. అదుపుతోకి తీసుకుని విచారించగా.. కొంతకాలంగా చెడు అలవాట్లకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని భావించి నగరంలోని దూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలుచేసి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తూ తాముా సేవిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈమేరకు ఆ ముగ్గురిపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృతి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 26: విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృతిచెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం రంగంపల్లిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామ శివారులోని పొలంలో పశువులు మేత చేస్తున్నాయి. ఈక్రమంలో రంగంపల్లి జవాజీ రమేష్‌కు చెందిన రెండు పశువులు కూడా మేత మేస్తున్నాయి. ఈక్రమంలో విద్యుత్ తీగలు తెగి ఆవులపై పడ్డాయి. దాంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఇటీవలే ఒక ఆవును రూ.75 వేలకు, మరో ఆవును రూ.65 వేలకు కొనుగోలు చేసినట్లు రమేష్ దంపతులు తెలిపారు. ఆవులు మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. పాడిఆవులు మృతి చెందడంతో జీవనాధారం కోల్పోయామని, ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని వారు కోరారు.


మృతిచెందిన ఆవుల వద్ద రోదిస్తున్న రమేష్ దంపతులు

వ్యాయామశాస్త్ర అధ్యాపకుడు నర్సింగ్‌రావుకు పీహెచ్‌డీ ప్రదానం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 26: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామశాస్త్ర అధ్యాపకుడు ఈ.నర్సింగ్‌రావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. వ్యాయామ విద్యలో ఎఫెక్ట్ ఆఫ్ ప్లయోమెట్రిక్స్ ట్రైనింగ్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ జనరల్ మోటార్ ఎబిలిటీస్ అమాంగ్ ద కబడ్డీ అండ్ ఖోఖో ప్లేయర్స్ ఆఫ్ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్, తెలంగాణ అనే అంశంపై పాలమూరు విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య శ్రీకాంత్ రాథోడ్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను పట్టా తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక, అధ్యాపకులు, సిబ్బంది నర్సింగ్‌రావును అభినందించారు.

మహిళలకు వరం మహాలక్ష్మి పథకం

షాబాద్, సెప్టెంబరు 26 : మహాలక్ష్మి పథకం నిరుపేద మహిళలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం షాబాద్‌లో ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన అందజేశారు. అనంతరం మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరానికి హాజరై వాటర్‌మెన్‌లకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో అపర్ణ, నాయకులు వసంతం, దర్శన్, మాజీ ఎంపీటీలు చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, రవీందర్‌నాయక్, రాఘవేందర్, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్ తదితరులున్నారు.


సబ్సిడీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూధన్‌రెడ్డి

షాబాద్ తహసీల్దార్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే

షాబాద్ తహసీల్దార్ అన్వర్‌పై ఎమ్మెల్యే యాదయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేసే కార్యక్రమానికి తహసీల్దార్ హాజరు కాకపోవడంతో ఎంపీడీవో చాంబర్‌కు పిలిపించి, రెవెన్యూ శాఖకు సంబంధించిన కార్యక్రమానికి హాజరు కాకపోవడం కారణమేంటని ప్రశ్నించారు. తనకు రిజిస్ట్రేషన్లు ఉన్నందున హాజరు కాలేదని తహసీల్దార్ చెప్పగా.. మొహర్బానీలు అవసరం లేదు.. విధులు సక్రమంగా నిర్వహించాలని మండిపడ్డారు. నెల క్రితం పోతుగల్ రెవెన్యూ పరిధిలోని 93 సర్వే నెంబర్‌లోని పట్టాదారుల వివరాలు, భౌగోళిక స్వరూపం వివరాలు తెలియజేయాలని చెప్పినా ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం ఎందుకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతుగల్ సర్వేనెంబర్ 93 ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఎర్రమట్టిని ఎంత తరలించారు? అక్రమ నిర్మాణాలకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు వెంటనే అందించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

గౌరవ వేతనం, కమీషన్ పెంచేలా చొరవ తీసుకోండి

- ఎమ్మెల్యే యాదయ్యకు రేషన్ డీలర్ల వినతి

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 26: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్‌ను పెంచే విధంగా కృషి చేయాలని రేషన్ డీలర్ల సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. ఈ మేరకు ఆయనను స్వగ్రామంలో కలిసి పలు సమస్యలపై వివరించారు. గత ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రేషన్ డీలర్లకు గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంచుతామని, డీలర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. తమ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని వినతిపత్రాన్ని యాదయ్యకు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్తయ్య, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల అధ్యక్షులు వీరస్వామిగౌడ్, నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి పాలమాకుల యాదయ్య యాదవ్, డీలర్లు రఫీక్, భానుచందర్ గౌడ్, విజయ్ సూర్య, కృష్ణ, సందీప్, శివయాదవ్‌లు ఉన్నారు.

రైతులూ రుణాలు పొందండి

షాద్‌నగర్‌అర్బన్, సెప్టెంబర్ 26: వ్యవసాయాభివృద్ధి కోసం రైతులు కావాల్సిన రుణాలు పొందాలని షాద్‌నగర్ సింగిల్ విండో చైర్మన్ డి. బక్కన్నయాదవ్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ సింగిల్ విండో మహాజన సభ గురువారం జరిగింది. సభలో బక్కన్నయాదవ్ మాట్లాడుతూ రుణాలు సకాలంలో చెల్లించిన రైతులతో పాటు రుణమాఫీ పొందిన అన్నదాతలకు సైతం తిరిగి రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఇతర రైతులకు కూడా కావాల్సిన రుణాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రుణాలు పొందిన రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించాలని కోరారు. ఏడీఏ రాజారత్నం మాట్లాడుతూ రుణమాఫీ రాని రైతులు కుటుంబ నిర్ధారణ చేయించుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లు తీసుకుని ఈనెల 28లోపు మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి రావాలని కోరారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ చల్లా పాండురంగారెడ్డి, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ రవికుమార్, ఏవో నిశాంత్‌కుమార్, సింగిల్ విండో సీఈఓలు రఘునందన్, వెంకటయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ బక్కన్న

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

షాబాద్ ఇన్‌చార్జి ఎంఈవోగా లక్ష్మణ్


లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

షాబాద్, సెప్టెంబరు 26 : షాబాద్ మండల ఇన్‌చార్జి ఎంఈవోగా డి.లక్ష్మణ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంఈవోగా శంకర్‌రాథోడ్ విధులు నిర్వహించారు. రాజేంద్రనగర్‌కు బదిలీ కావడంతో డి. లక్ష్మణ్ బాధ్యతుల చేపట్టారు. పీఆర్‌టీయూ మండల శాఖ నాయకులు ఎంఈవోను సన్మానించారు. మండలాధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సంఘం నాయకులు అంజయ్య, నర్సింహులు, సుశీల, సునీత, ఖాజాపాషా, జైపాల్‌రెడ్డి, సింహాద్రినాయుడు, అంజి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవోగా చంద్రశేఖర్


ఎంఈవో చంద్రశేఖర్, మనోహర్‌లను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 16: కేశంపేట మండల ఇన్‌చార్జి ఎంఈవోగా కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, మనోహర్‌లను సత్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షుడు ప్రకాశ్, కార్యదర్శి వెంకట్‌ప్రసాద్ తదితరులున్నారు.

కొత్తూర్ ఎంఈవోగా అంగోర్‌నాయక్



కొత్తూర్, సెప్టెంబరు 26: కొత్తూర్ నూతన ఎంఈవోగా అంగోర్‌నాయక్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న అంగోర్‌నాయక్ ఎంఈవోగా పదోన్నతి పొందారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో కిష్టారెడ్డి శంషాబాద్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వెళ్లారు.

చేవెళ్ల ఇన్‌చార్జి ఎంఈవోగా పురందాస్



చేవెళ్ల, సెప్టెంబరు 26 : పదేళ్ల తర్వాత మండలానికి ప్రభుత్వం ఇన్‌చార్జి విద్యాధికారిని నియమించింది. మండల విద్యావనరుల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంఈవోగా ఎల్.పురందాస్ బాధ్యతలు తీసుకున్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుగా పనిచేస్తున్న ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవో పురందాస్‌ను ఘనంగా సన్మానించారు.

ఎంఈవో పాండుకు సన్మానం

ఆమనగల్లు, సెప్టెంబరు 26: మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పాండుకు గురువారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మార్సీ కార్యాలయం వద్ద పాండును సంఘం నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల శాఖ అధ్యక్షుడు మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలు మమత, కార్యదర్శి నల్‌రాజ్, ఎంఆర్‌సీ సిబ్బంది సాయి, తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి చర్యలు

ఆమనగల్లు, సెప్టెం బరు 26: సహకార రంగం బలోపేతం, వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులతో గురువారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి 500 గజాల స్థలం, కడ్తాలలో గోదాం నిర్మాణానికి 1.20 ఎకరాల భూమిని కేటాయించాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్లతో కలిసి గంప వెంకటేశ్ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కడ్తాలలో మల్టీ సర్వీసెస్ సెంటర్ (ఎంఎస్‌సీ) స్కీం కింద పీఏసీఎస్‌కు భూమి కేటాయింపునకు విన్నవించగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రొసీడింగ్ దశలోనే నిలిచిపోయిందని తెలిపారు. భూమి కేటాయించే విధంగా చూడాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పీఏసీఎస్ కు కేటాయించిన భూమికి సంబంధించి సర్వే నిర్వహించి సమగ్ర నివేదికను తమకు అందజేయాలని కడ్తాల తహసీల్దార్ ముంతాజ్‌కు ఆదేశించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, డైరెక్టర్లు వెంకటేశ్, వీరయ్య, వెంకటేశ్, జంగమ్మ, సీఈవో దేవేందర్, పద్మాకర్, నాయకులు కొండల్‌రెడ్డి, భీష్మాచారి, తదితరులున్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న వెంకటేశ్

దేవ గన్నేరు పుస్తకావిష్కరణ

అజిలాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే రచించిన దేవ గన్నేరు కవితా పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించగా ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సాహిత్య యువ పురస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి తగుళ్ల గోపాల్ ఆధ్వర్యంలో రచించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విద్యార్థులచే పుస్తకాన్ని రచించచడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంజీవ్ యాదవ్, మోతిలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి బీజేపీ కృషి


మాట్లాడుతున్న అరవింద్ మీనన్

మొయినాబాద్, సెప్టెంబరు 26 : దేశ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బీజేపీ జాతీయ సంఘటన్ సహ మంత్రి అరవింద్ మీనన్ అన్నారు. మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలోని పెద్దమంగళారం గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అరవింద్ మీనన్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికి చేరేలా కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాష్, మదన్‌మోహన్‌గుప్తా, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, మోర నర్సిరెడ్డి, మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, ఎల్లేష్‌గౌడ్, శ్రీనివాస్, లక్ష్మిపతియాదవ్, వెంకటేష్, శివకుమార్ తదితరులున్నారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా మాణిక్యం

శంకర్‌పల్లి, సెప్టెంబరు 26: పీఆర్టీయూ శంకర్‌పల్లి మండల నూతన అధ్యక్షుడిగా మాణిక్యంను ఎన్నుకున్నారు. మానవ వనరుల కేంద్రంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, గౌరవాధ్యక్షుడిగా రాములు, అసోసియేట్ అధ్యక్షుడిగా హరికృష్ణ, కార్యదర్శిగా శ్రీరాములు, మహిళా ఉపాధ్యక్షురాలిగా శాంతి, కార్యదర్శిగా సరిత, ఉపాధ్యక్షులుగా జయరాములును ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాణిక్యం అన్నారు.

సంక్షిప్తంగా..

శంషాబాద్ : డిల్లీలో అమలు చేసిన విధంగానే తెలంగాణలో కూడా కార్మికులకు కనీస వేతన చట్టాలు అమలు చేయాలని హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్) జిల్లా అధ్యక్షుడు జి. మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. డిల్లీలో కొత్తగా పదవీ బాధ్యతలు సీఎం అతిశీ కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్టు ప్రకటించి డిల్లీలో కనీస వేతన చట్టాన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించిన విషయం ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

షాబాద్ : ఎమ్మెల్యే కాలె యాదయ్య మండల పరిధిలోని మీరాపూర్ దర్గాలో పీసీసీ ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, దర్గా నిర్వాహకుడు చెన్నాబాయిలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆక్యుపంక్చర్, సీడ్ థెరపీ, ఇజామా, కప్ థెరపీ సెంటర్లను ప్రారంభించారు. మండల నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.

కడ్తాల్ : గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ (ఎన్ఐఆర్‌డీ) ఆధ్వర్యంలో కడ్తాల గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహిస్తున్నారు. అభివృద్ధి చెందిన జీపీలలో గ్రామ సభల నిర్వాహణకు ఎన్ఐఆర్‌డీ దేశ వ్యాప్తంగా 750 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసింది. అందులో కడ్తాల ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం గ్రామ సభ నిర్వాహణపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో సుజాత అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : ఫ్యాషన్ డిజైన్ కోర్సులపై విద్యార్థులు మరింత ఆసక్తిని పెంచుకోవాలని శిక్షణ ఉపాధ్యాయుడు కృష్ణ తెలిపారు. చేవెళ్ల మోడల్ స్కూల్‌లోని ఒకేషనల్ ఇంటర్ విద్యార్థినులు గండిపేట్ మండల పరిధి సన్‌సిటీలో ఉన్న ఎన్‌సీఎఫ్‌టీ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. విద్యార్థులకు ఫ్యాషన్ డిజైన్‌కి సంబంధించిన మెలకువలను కృష్ణ వివరించాడు.

తలకొండపల్లి : మండల పరిధిలోని పాతకోట తండాలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంమైంది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని ఆసుపత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ అలివేలుజీర్యనాయక్, ఉప సర్పంచ్ పద్మగుర్‌సింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అఖిల్, అనిల్, కామినేని ఆసుపత్రి వైద్యసిబ్బంది 174 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాడ్గుల, సెప్టెంబరు 26 : మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన కట్ట శంకరయ్య(45) కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే, అతడు కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఆయన మృతిచెందాడు. దాంతో డిపో మేనేజర్ సుభాషిణి గ్రామానికి చేరుకొని శంకరయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం మృతుడి భార్య సైదమ్మకు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. డిపో సూపరింటెండెంట్ ఎస్ఎం నాయక్, కండక్టర్ యాదయ్య, రఘుపతి, శేఖర్, సదానంద్, నర్సింహ, వెంకటయ్య, పులిజాల రాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి కృషి


బీరువాలు, ఆట వస్తువులను అందజేస్తున్న రాంచందర్ ముదిరాజ్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 26: గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చదువు రాంచందర్ ముదిరాజ్ తెలిపారు. మండలంలోని చిలుకూరు గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయన గురువారం బీరువాలు, ఆట వస్తువులు ఇతర సామగ్రిని సొంత డబ్బులతో సమకూర్చి అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, దర్శన్, అంగన్‌వాడీల సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేతకు చర్యలు

కడ్తాల్, సెప్టెంబరు 26: మండల కేంద్రంలో తలకొండపల్లి చౌరస్తా వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా మారిన గోతుల మరమ్మతులకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో వర్షం నీరు పోవడానికి వీలుగా రహదారిని అనుసరించి భారీ కాలువ నిర్మించారు. కాల్వపై రహదారి మధ్యలో వేసిన స్లాబ్ వాహనాల రద్దీ, ఒత్తిడితో రెండు చోట్ల ధ్వంసమైంది. కడ్తాల చౌరస్తాలో తలకొండపల్లి వెళ్లే దారిలో కాలువపై స్లాబ్ నిర్మాణం పాడై ఇనుప చువ్వలు తేలాయి. రహదారి మధ్యలో స్లాబ్ పాడై గోతులతో నెలల కాలంగా వాహన దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే నారాయణ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. ఆయన అధికారులకు ఆదేశించగా గురువారం ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఇంజనీయర్ కె.గంగాధర్, బ్రిడ్జి ఇంజనీయర్ శ్రీనివాస్, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ భట్టాచార్య గోతులను పరిశీలించారు. వారం రోజుల్లో కాల్వపై స్లాబ్ ధ్వంసమై ఏర్పడ్డ గోతులను పూడ్చి వేయిస్తామని తెలిపారు.

సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతులు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 26: కొండకల్-శంకర్‌పల్లి బీడీఎల్ రోడ్డు వర్షాలకు పూర్తిగా పాడపోయింది. దాంతో కొండకల్ మాజీ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి గురువారం సొంత నిధులు వెచ్చించి రోడ్డుకు మరమ్మతులు చేశారు. మొరం పోయించి చదును చేయించారు. రోడ్డును బాగు చేయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు రోడ్డు పాడవ్వడంతో సొంతంగా సుమారు లక్ష రూపాయలతో బాగు చేయించినట్లు తెలిపారు.


మరమ్మతులు చేయిస్తున్న మాజీ ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి